నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
5 | కరీంనగర్, శనివారం 28 సెప్టెంబర్ 2024 | RAJANNA SIRCILLA

బస్సు ఓవర్ లోడ్.. పేలిన టైర్!

నుస్తులాపూర్ శివారులో ఆగిన బస్సు

తిమ్మాపూర్, సెప్టెంబర్ 27: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసినప్పటి నుంచి రద్దీ పెరుగుతున్నది. ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగుకు తాకిడి ఎక్కువ ఉంటున్నది. అయితే రద్దీకి అనుగుణంగా బస్సులు నడపకపోవడంతో వచ్చే బస్సులపై ఓవర్ లోడ్ పడుతున్నది. ఈ కారణంగానే హుస్నాబాద్ డిపోకు చెందిన బస్సు టైర్ పేలినట్టు తెలుస్తున్నది. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ నుంచి హుస్నాబాద్‌కు దాదాపు వంద మందికి పైగా ప్రయాణికులతో వెళ్తున్నట్టు తెలుస్తుండగా, నుస్తులాపూర్ దాటిన తర్వాత రాజీవ్‌రహదారిపై భారీ శబ్దంతో వెనుక టైరు పేలింది. దీంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తర్వాత టైరు పేలిందని తెలుసుకుని ఊపిరిపీల్చుకున్నారు. సాయంత్రం సమయంలో సంఖ్యకు సరిపడా బస్సులు లేకపోవడంతోనే తరచూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు రద్దీ సమయాల్లోనైనా బస్సులను ఎక్కువగా తిప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

దార్శనికుడు లక్ష్మణ్ బాపూజీ

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల, సెప్టెంబర్ 27: 'స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ దార్శనికుడు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన గొప్ప నాయకుడు' అని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల కొనియాడారు. కోరుట్ల పట్టణంలోని కార్గిల్ చౌక్ వద్ద శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాపూజీ జయంతి వేడుకల్లో పాల్గొని, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. బాపూజీ తుది శ్వాస విడిచేంత వరకు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడారని, బీసీల అభ్యున్నతి కోసం చట్టసభల్లో గొంతెత్తి పోరాడిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ తిరుపతి, పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, సంఘం అధ్యక్షుడు గుంటుక ప్రసాద్, నాయకులు జువ్వాడి కృష్ణారావు, గడ్డం మధు, ముల్క ప్రసాద్, జిల్లా ధనుంజయ్, ఫహీం, రవి కుమార్, వినయ్, వేణుగోపాల్, అనిల్, సత్యం, నాగభూషణం, సునీల్, విశ్వనాథం, రాములు, గంగాధర్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌లో ₹2 కోట్ల గోల్‌మాల్?

- బైలాకు విరుద్ధంగా ఖర్చులు
- తప్పుల తడకలా లెక్కలు
- నిబంధనల ప్రకారం కానరాని మీటింగ్‌లు
- తీవ్రస్థాయిలో ఆగ్రహించిన సభ్యులు
- ఈసీ మీటింగ్‌లో దుమారం!
- బెదిరింపులు, హెచ్చరికలతో గంటపాటు రసాభాస
- స్వాహా చేసిన డబ్బులు తిరిగి చెల్లించాలని డిమాండ్
- ₹30 లక్షల వరకు తిరిగి జమ చేసేందుకు నాయకత్వం చర్యలు
- అక్రమాలను బహిర్గతం చేసే దిశగా మెజార్టీ సభ్యుల అడుగులు

కరీంనగర్ రైస్‌మిల్లు అసోసియేషన్‌లో భారీ అక్రమాలు జరిగాయా..? వివిధ కారణాలు, ఖర్చుల పేరిట మిల్లర్ల నుంచి వసూలు చేసిన ₹2 కోట్లు గోల్‌మాల్ అయ్యాయా..? బైలాకు విరుద్ధంగా అసోసియేషన్ నడుస్తున్నదా..? నిబంధనల ప్రకారం జనరల్‌బాడీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్‌లు పెట్టకుండా దాదాపు 17 నెలలుగా నిర్లక్ష్యం చూపారా..? ఈసీలో తీర్మానం చేయకుండానే మంత్రులు, నాయకులకు లక్షలు ఇచ్చినట్టు తప్పుడు లెక్కలు రాసి.. వచ్చిన డబ్బులను పక్కదారి పట్టించారా..? లెక్కలు అడిగితే దాటవేస్తున్నారా..? అంటే అవుననే సమాధానమే వస్తున్నది. ఈ నెల 26న జరిగిన అసోసియేషన్ ఈసీ మీటింగ్‌లో సభ్యులు లేవనెత్తిన అంశాలు, చూపిన తప్పుడు లెక్కలు, బెదిరింపులు, బుజ్జగింపులు జరిగిన తీరు దీనికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుండగా.. ప్రస్తుతం ఈ వ్యవహారం రైస్‌మిల్లర్లలో హాట్‌టాపిక్‌లా మారింది. ఈ వేడి మరింత ఉధృతం అయ్యేలా కనిపిస్తున్నది. అంతేకాదు, ఈసీ సమావేశంలో జరిగిన బెదిరింపుల వ్యవహారాన్ని మిల్లర్లు తీవ్రంగా పరిగణిస్తుండగా.. మరోసారి ఈ తరహా ఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడానికి నాయకత్వం హామీ ఇచ్చినట్టు తెలుస్తున్నది.

కరీంనగర్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కరీంనగర్ రైస్‌మిల్ అసోసియేషన్‌లో కొంతకాలంగా ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం నెలకొన్నది. ఈ నేపథ్యంలోనే రా రైస్ మిల్లర్లు నూతన సంఘంగా ఏర్పడినట్టు మిల్లర్లలో చర్చ జరుగుతున్నది. ఇదిలా ఉంటే ఈ నెల 26న మిల్లర్స్ భవన్‌లో అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈసీలోని కొంత మంది సభ్యులు.. అసోసియేషన్‌లో జరుగుతున్న వ్యవహారంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధానంగా బైలా ప్రకారం అసోసియేషన్ ఎందుకు నడుపడం లేదని నాయకత్వాన్ని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం ప్రతి రెండు నెలలకోసారి ఈసీ సమావేశం నిర్వహించి, అసోసియేషన్ పెట్టిన ఖర్చులు, వచ్చిన ఆదాయాలు, ఇతర అంశాలపై చర్చ జరగాలని, గడిచిన 17 నెలల్లో ఎన్ని సార్లు మీటింగ్ పెట్టారో చెప్పాలని నిలదీసినట్లుగా తెలుస్తున్నది. అలాగే వానాకాలం యాసంగి రబీ సీజన్‌లో అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశాలు పెట్టాల్సి ఉన్నా ఎందుకు నిర్వహించడం లేదని, దానికి కారకులెవ్వరని ధ్వజమెత్తినట్టు సమాచారం. అత్యవసర నిర్ణయాలు, లేదా ఇతర సమయాల్లోనూ.. ఈసీ మీటింగ్‌లు పెట్టి, ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా చర్చించి ఆమోదించిన తర్వాత మాత్రమే అమలు చేయాల్సిన అనేక అంశాలను కేవలం ఒకరిద్దరు ఎలా అమలు చేస్తారని ప్రశ్నించినట్టు తెలుస్తున్నది. అసలు సమావేశాలు పెట్టకుండా ఏక చక్రాధిపత్యం ఏమిటంటూ సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించడమేకాదు, నాయకత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారని మిల్లర్ల ద్వారా తెలుస్తున్నది. బైలా ప్రకారం సాగాల్సిన సమావేశాలు నిర్వహించకపోవడంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు.. నాయకత్వం సరైన సమాధానం చెప్పకపోవడంతో సభ్యులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారని విశ్వసనీయ సమాచారం.

₹2 కోట్ల గోల్‌మాల్?

గడిచిన 18 నెలలుగా మిలర్స్ అసోసియేషన్ భవన్ పరిధిలో ఉన్న దుకాణా సముదాయాలకు వచ్చిన అద్దెలు, అలాగే వివిధ ఖర్చులు, మిల్లర్స్ నుంచి అసోసియేషన్ పేరిట వసూలు చేసిన డబ్బుల వ్యవహారంపై సమావేశంలో పెద్ద దుమారమే రేగినట్టు అత్యంత విశ్వసనీయ సమాచారం. గత ప్రభుత్వం మిల్లర్ల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సివిల్ సప్లై కొనుగోలు చేసేలా అనుమతులు ఇప్పిస్తే.. అధికారుల ఖర్చులంటూ లారీకి ₹3వేల చొప్పున దాదాపు కోటికిపైగా వసూలు చేశారని, ఆ లెక్కలు చెప్పాలని సభ్యులు సూటిగా ప్రశ్నించినట్టు తెలుస్తున్నది. దీంతో పాటు తమ్మినాడుకు బియ్యం పంపినప్పుడు క్వింటాలుకు ₹5 చొప్పున ఖర్చుల కింద మిల్లర్ల నుంచి ₹40లక్షలకుపైగా వసూలు చేశారని, అలాగే నెలకు దాదాపు రెండు లక్షల అద్దెలు వస్తున్నాయని, వాటి వివరాలు ఎక్కడో చెప్పాలని నిలదీసినట్టు తెలుస్తున్నది. ఇవేకాకుండా వివిధ సందర్భాల్లో ఖర్చుల కోసం వసూలు చేసిన అన్నీ కలిపి దాదాపు రెండున్నర నుంచి మూడు కోట్లకు లెక్కలు చెప్పాలని ప్రశ్నించడంతోపాటు 17నెలల లెక్కలు చూపాల్సిన చోట కేవలం పది నెలల ఆదాయ వ్యయ వివరాలు మాత్రమే, అది కూడా తప్పుడు తడకలుగా ఎందుకు చూపారని, అలాగే మిగిలిన నెలల లెక్కలు ఎందుకు చూపలేదో చెప్పాలని గట్టిగానే అడిగినట్టు తెలుస్తున్నది. దీంతో నాయకత్వం కొన్ని లెక్కలను ముందు పెట్టినట్టు తెలుస్తున్నది. అందులో కొంతమంది ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉన్నతాధికారులకు లక్షల్లో ముడుపులు ఇచ్చినట్టు లెక్కలు చూపడంతో మరోసారి ఈసీ సభ్యులు భగ్గుమన్నారు. బైలా ప్రకారం కేవలం ₹5వేలవరకు మాత్రమే ఖర్చు పెట్టే అధికారం మిల్లర్స్ అసోసియేషన్ నాయకత్వానికి ఉందని, అలాంటప్పుడు లక్షల్లో ముడుపులు ఇవ్వాల్సి వస్తే ఈసీతో చర్చించాల్సిన అవసరం లేదా..? అని నిలదీసినట్టు తెలుస్తున్నది. ₹5వేల వరకే మీ పవర్ ఉండగా లక్షల్లో ఎలా ఇస్తారని? అందులో భారీ మొత్తంలో గోల్‌మాల్‌తోపాటు స్వాహా పర్వం సాగిందని సభ్యులు మండిపడ్డట్టు అసోసియేషన్ నాయకుల ద్వారా తెలుస్తున్నది. సభ్యులు ప్రశ్నించిన మేరకు ₹30 లక్షల వరకు అసోసియేషన్‌కు జమజరిగేలా చూస్తామని నాయకత్వం హామీ ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం.

చల్లారని వేడి

ఈసీ సమావేశంలో జరిగిన వివాదం, నిధులు పక్కదారి వంటి అంశాలు ప్రస్తుతం మిల్లర్స్ అసోసియేషన్‌లో హాట్‌టాపిక్ అయ్యాయి. ప్రస్తుతం ఏ నలుగురు మిల్లర్లు కలిసినా ఇదే అంశంపై చర్చ జరుగుతున్నది. ఈ పరిస్థితుల్లో కొంత మంది మిల్లర్లు ఈసీకి పూర్తిస్థాయిలో మద్దతు ఇవ్వడంతోపాటు నిధుల గోల్‌మాల్ లెక్కతేలి, పారదర్శకంగా లెక్కలు చూపే వరకు ఇలాగే ముందుకెళ్లాలని ఈసీ సభ్యులను కోరినట్టు తెలుస్తున్నది. దీంతో ఈసీ సభ్యులు అసోసియేషన్ వ్యవహారాలు, వచ్చిన ఆదాయం , వివిధ ఖర్చుల పేరిట వసూలు చేసిన డబ్బులు, అధికారులకు ఇచ్చినట్టు చూపుతున్న అనాధిరిక లెక్కలు, బైలా విస్మరణ వంటి అంశాలను పూర్తి స్థాయిలో తేల్చాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తున్నది. ఈ వ్యవహారంలో పూర్తి స్థాయి లెక్కలు తేలే వరకు.. మరింత లోతుగా వెళ్లాల్సిందే అన్న నిర్ణయానికి ఈసీలోని మెజార్టీ సభ్యులు రావడంతో ఈ వ్యవహారం మరింత ముదిరే అవకాశాలున్నాయని మిల్లర్లు చర్చించుకుంటున్నారు.

కోడలు, మనుమరాలిని కాపాడబోయి..

- కరెంట్ షాక్‌తో మామ మృత్యుఒడికి
- తల్లీకూతురుకి తప్పిన ప్రాణాపాయం
- కటికెనపల్లిలో విషాదం

మామిడి రాజయ్య (ఫైల్)

ధర్మారం, సెప్టెంబర్ 27 : షాక్ తగిలి పడిపోయిన కోడలు, మనుమరాలిని కాపాడబోయి మామ మృత్యుఒడికి చేరాడు. విద్యుత్ వైర్ తొలగించే ప్రయత్నంలో స్విచ్‌బోర్డు ఆయనపైనే పడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఇంటి పక్కనే ఉన్న వ్యక్తి వచ్చి కేబుల్‌ను తొలగించడంతో తల్లీబిడ్డకు ప్రాణాపాయం తప్పింది. ఎస్ఐ శీలం లక్ష్మణ్ వివరాల ప్రకారం.. ధర్మారం మండలం కటికెనపల్లి గ్రామానికి చెందిన మామిడి శిరీష శుక్రవారం ఉదయం ఇంటి ఫ్లోరింగ్‌ను నీటితో శుభ్రం చేస్తున్నది. ఆ సమయంలో ఇంటి లోపల కట్టిన జే వైర్ మీద నుంచి దుప్పటి కింద పడడంతో తిరిగి దానిపై వేసింది. స్విచ్ బోర్డు నుంచి కనెక్షన్ ఉన్న తీగ నుంచి జే వైర్‌కు విద్యుత్తు సరఫరా కావడంతో శిరీష షాక్ తగిలి కింద పడిపోయింది. తల్లికి ఏమి జరిగిందో చూడడానికి వెళ్లిన ఆమె కూతురు సంకీర్తన (4)కు కూడా షాక్ తగిలి, అరుస్తూ కిందపడిపోయింది. గమనించిన శిరీష మామ రాజయ్య (56) ఆ ఇద్దరిని కాపాడే ప్రయత్నం చేశాడు. స్విచ్ బోర్డు నుంచి వైర్ తీస్తున్న క్రమంలో ఆయనపై పడి షాక్ తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. అరుపులు విని పక్కింటిలో ఉన్న రాజయ్య తమ్ముడు క్షణాల్లో వచ్చి, స్విచ్ బోర్డుకు సరఫరా జరిగే వైర్‌ను పూర్తిగా తొలగించడంతో శిరీష, ఆమె కూతురు సంకీర్తనకు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. గాయపడిన ఆ ఇద్దరిని కరీంనగర్‌లోని ఓ దవాఖాన తరలించగా, చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలాన్ని ఏఎస్ఐ, ధర్మారం ట్రాన్స్‌కో ఏఈ ఎండీ ఖాసీం, లైన్‌మెన్ శ్రీనివాస్, ఏఎల్ఎం ఓదెలు పరిశీలించి, వివరాలు సేకరించారు. కాగా ఈ ఘటనపై రాజయ్య భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పీజీ ఫలితాల విడుదల

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 27 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జూలై, ఆగస్టులో నిర్వహించిన ఎంఎస్సీ పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా, ఎంఎస్సీ మైక్రో బయాలజీ, ఫుడ్‌సైన్స్, డాటా సైన్స్, మాథ్యమెటిక్స్ రెండో, నాలుగు సెమిస్టర్ ఫలితాలు ఆన్‌లైన్‌లో ఉంచామని చెప్పారు. వివరాలకు www.satavahana.ac.in సైట్‌లో పరిశీలించాలని సూచించారు.

విప్ ఆది శ్రీనివాస్, అధికారులకు దండం పెట్టి వేడుకుంటున్న దేవమ్మ

సారూ.. మా ఇండ్లు పోకుండా చూడండి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గుడి చెరువు వద్ద ప్రజల వినతి

వేములవాడ, సెప్టెంబర్ 27: 'సారూ.. మా ఇండ్లు పోకుండా, పడగొట్టకుండా చూడండి' అంటూ వేములవాడ పట్టణంలోని గుడి చెరువు వద్ద నివాసముండే ప్రజలు శుక్రవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు విన్నవించారు. ఇటీవల గుడి చెరువు వద్ద అధికారులు సర్వే చేసి, ఎఫ్‌టీఎల్‌లో నివాసాలు ఉన్నట్టు గుర్తించారు. దీంతో ఆందోళన చెందిన అక్కడి ప్రజలు శుక్రవారం వేములవాడ సహకార సంఘం వద్ద ఆది శ్రీనివాస్‌ను కలిశారు. తాము ఎన్నోఏండ్ల కిందనే అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపట్టుకొని జీవిస్తున్నామని తెలిపారు. అయితే సర్వేతో తాము ఆందోళన చెందుతున్నామని, నివాసాలు పోకుండా మమ్మల్ని కాపాడాలని దండం పెట్టి మరీ వేడుకోగా, ఆది శ్రీనివాస్ స్పందించారు. నివాసాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఇక్కడ ఆర్డీవో రాజేశ్వర్ ఉన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నాయకులు, ఉద్యోగులు

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

కరీంనగర్ ముకరంపుర, సెప్టెంబర్ 27: రామగుండంలో కొత్తగా నిర్మించనున్న 800మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణంలో సింగరేణికి భాగస్వామ్యం వద్దంటూ విద్యుత్ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ(టీజీపీఈ-జాక్) కరీంనగర్ సర్కిల్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో నిరసన చేపట్టారు. ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రాజెక్ట్ బాధ్యతలను పూర్తిగా జెన్‌కోకు అప్పగించాలని డిమాండ్ చేశారు. నిరసనలో కరీంనగర్ జేఏసీ నాయకులు నాయిని అంజయ్య, వీరయ్య, సంపత్ కుమార్, శ్రీనివాస్, జనార్దన్, స్వామి, సుధీర్ కుమార్, కిరణ్, డీఈలు విజయేందర్ రెడ్డి, రాజం, ఏడీఈలు నరేందర్, శ్రీనివాస్, లావణ్య, స్వప్న, ఉద్యోగులు పాల్గొన్నారు.

రామగుండంలో హైడ్రా!

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలపై సర్వే • ఇప్పటికే మల్కాపూర్‌లో 17 నిర్మాణాలకు నోటీసులు • నాలాల ఆక్రమణలపైనా ఫోకస్.. నిర్మాణాల తొలగింపు • అనుమతులు లేని మరో రెండు ఫంక్షన్ హాళ్లకు నోటీసులు • ప్రజల్లో ఆందోళన

గోదావరిఖని తిలక్‌నగర్‌లో రోడ్డు పక్కన నిర్మాణాలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

కోల్‌సిటీ, సెప్టెంబర్ 27: రామగుండం నగర పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చివేతకు అధికారులు ఆపరేషన్ సిద్ధం చేస్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలపై హైడ్రా తరహా చర్యలకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలతో ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు నగర పాలక సంస్థ పరిధిలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను గుర్తించేందుకు విస్తృత సర్వే చేపడుతున్నారు. ఈ క్రమంలో మల్కాపూర్ పరిధిలో మల్లపురాణి కుంటలో చేపట్టిన దాదాపు 17 నిర్మాణాలు ఎఫ్‌టీఎల్‌లోకి వస్తాయని రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు నివేదికలు సమర్పించగా, ఆయన స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం ఇన్‌చార్జి కమిషనర్ జే అరుణ శ్రీ సదరు నిర్మాణదారులకు నోటీసులు కూడా పంపించారు. అలాగే శుక్రవారం గోదావరిఖనిలోని తిలక్‌నగర్ ఏరియాలో కూడా ఇన్‌చార్జి కమిషనర్, నగర పాలక సిబ్బందితో కలిసి సర్వే పనులను పరిశీలించారు. రోడ్డు ఆక్రమిత నిర్మాణాలకు నోటీసులు ఇవ్వకుండా తొలగించనున్నట్టు స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలో ఎక్కడ కూడా అలాంటి నిర్మాణాలు ఉన్నా వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాగా, జంక్షన్ అభివృద్ధిలో భాగంగా రోడ్డును ఆనుకొని ఉన్న 10 దుకాణాలను శుక్రవారం పూర్తిగా తొలగించారు. అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన రెండు ఫంక్షన్ హాళ్లకు నోటీసులు కూడా జారీ చేశారు.

నాలాల ఆక్రమణలపై గురి

గోదావరిఖని మార్కండేయ కాలనీ, దుర్గానగర్, కళ్యాణ్‌నగర్, మేదరిబస్తీ, సప్తగిరి కాలనీ తదితర ఏరియాల్లో ప్రధాన నాలాలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై బల్దియా ఫోకస్ పెట్టింది. ఇన్‌చార్జి కమిషర్ అరుణ శ్రీ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు రెండ్రోజులుగా సర్వే చేస్తున్నారు. వీటిలో అధిక శాతం మార్కండేయ కాలనీ, దుర్గానగర్, గౌతమినగర్, కల్యాణ్‌నగర్, సప్తగిరి కాలనీలో నాలాలపై నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించారు. అలాగే ఇటీవల కూల్చివేసిన ఓల్డ్ అశోక్ థియేటర్ పక్కనే దాదాపు 20 సెల్ ఫోన్ దుకాణాలను కూడా తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు.

నోటీసులు ఇస్తున్నం

రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సర్వే ఆధారంగా రామగుండం కార్పొరేషన్‌లో బఫర్ జోన్, ఎఫ్‌టీల్ పరిధిలో చేపట్టిన నిర్మాణాలకు నోటీసులు ఇస్తున్నాం. వాటిని ఖాళీ చేయని పక్షంలో పైనుంచి ఆదేశాలు వచ్చిన పిదప కూల్చివేత చర్యలు చేపడుతాం. గోదావరిఖని అడ్డగుంటపల్లి ప్రాంతం రెవెన్యూ రికార్డుల ప్రకారంగా చూస్తే బఫర్ జోన్‌లో లేదు. ఏమైనా ఫిర్యాదులు వస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఇంకా నగరంలో రోడ్డు ఆక్రమిత నిర్మాణాలను కూడా తొలగిస్తాం.

- అరుణ శ్రీ, పెద్దపల్లి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

డ్రగ్స్ కంట్రోల్ అధికారుల తనిఖీలు

జగిత్యాల, కోరుట్లలో నిషేధిత డ్రగ్స్ స్వాధీనం

ఓ మెడికల్ షాపులో అధికారుల తనిఖీలు

కరీంనగర్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ముమ్మర దాడులు చేశారు. కరీంనగర్‌తోపాటు జగిత్యాల, కోరుట్లలో ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఏ శ్రీనివాస్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు పీ కార్తీక్ భరద్వాజ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. కాగా, కోరుట్ల, జగిత్యాలలోని పలు మెడికల్ దుకాణాల్లో ఎల్ ఆర్జినైన్ అండ్ సిల్డ్‌నాఫిల్ సాఫ్ట్‌జెల్ క్యాప్సూల్స్‌ను అధికారులు పట్టుకున్నారు. 2018 సెప్టెంబర్‌లో ఈ డ్రగ్స్‌ను కేంద్ర ప్రభుత్వం నిషేధించినట్లు, ఈ మందులను మానవ అవసరాలకు విక్రయించరాదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో విక్రయిస్తున్నారని అధికారులు తెలిపారు. హిమాచల్ ప్రదేశ్, హర్యానాలో తయారవుతున్న ఈ మందులను ఎల్ బ్రాండ్ పేరిట విక్రయిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. మార్కెట్‌లో అక్రమంగా విక్రయిస్తున్న ఈ డ్రగ్స్‌ను పెద్ద మొత్తంలో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మాదక ద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాలు, ఏవైనా అనుమానాస్పద మందులు మార్కెట్‌లో చలామణి అవుతున్నట్లు గుర్తించినట్లయితే 1800-599-6969 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని అధికారులు సూచించారు.